క్లుప్తంగా

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ప్రకాశంనగర్: స్థానిక పేపర్‌మిల్లులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, గుర్తింపు ఎన్నికలు వెంటనే జరిపించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేపట్టిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా శనివారం పేపర్ మిల్లు గేటు ఎదుట రిలే నిరాహార దీక్ష చేస్తున్న కార్మిక నాయకులకు ఆయన సంఘీభావం తెలిపారు. దీక్షలో గుమ్మడి కృష్ణారావు, బి.శ్యామ్‌కుమార్, బి.శ్రీనివాస్‌కుమార్, డి.ప్రవీణ్, టి.సత్యనారాయణ, ఎండీ బషీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మో మంటలు



బైపాస్ రోడ్డులో చెలరేగుతున్న మంటలు

కడియం: దుళ్ల బైపాస్ రోడ్డులో శనివారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బైపాస్ రోడ్డును ఆనుకుని చెత్తను డంపింగ్ చేస్తుంటారు. ఇక్కడ చెత్తకు నిప్పంటుకుని ఉదయం నుంచి మండుతోందని స్థానికులు తెలిపారు. సాయంత్రం సమయానికి మంటలు భారీగా ఎగసిపడ్డాయి. చెత్తతో పాటు కలిసి ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలకు మంటలు అంటుకోవడంతోనే భారీగా మంటలు వచ్చాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఘాటైన వాసన, పొగతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

దోసాలమ్మకు ప్రత్యేక పూజలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామ దేవత దోసాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. చీర, గాజులు సమర్పించి పూజలు చేశారు.

నగరంలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్



కార్యక్రమంలో పాల్గొన్న సోము వీర్రాజు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో నివసిస్తున్న ఉత్తర భారతీయులకు ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ అనే నినాదంతో మన సంక్రాంతి సంప్రదాయ పిండి వంటలను పరిచయం చేసినట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తెలిపారు. శనివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. మహారాష్ట్రీయులు, గుజరాతీలు, రాజస్థానీయులు ఉత్తర రాష్ట్రాల చెందిన కొంతమందిని కార్యాలయానికి ఆహ్వానించి సున్నుండలు, అరిసెలు, పోకుండలు, జంతికలు, కజ్జికాయలు ఇతరత్రా పిండి వంటకాలు అందజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేలంగి శ్రీదేవి, ఓబీసీ జోనల్ ఇన్‌చార్జి కూరగంటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జీఓను వ్యతిరేకిస్తూ నిరసన

ప్రకాశంనగర్: జీఓ నంబర్ ఒకటిని వ్యతిరేకిస్తూ టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ, సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ, బీఎస్పీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక సోమలమ్మ గుడి సెంటర్‌లో నిరసన తెలిపారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి, మాజీ ఎమ్మెల్సీలు ఆదిరెడ్డి అప్పారావు, కందుల దుర్గేష్, న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపాక మధు పాల్గొన్నారు.

వీరుళ్లమ్మ జాతర ప్రారంభం

అనపర్తి: అనపర్తి ప్రజల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న వీరుళ్లమ్మ తల్లి జాతర, తీర్థ మహోత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో ముస్తాబు చేశారు. అమ్మవారిని బంగారు, వెండి ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సంక్రాంతిని పురస్కరించుకుని ఏటా ఐదు రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తారు. అమ్మవారి జాతరను పురస్కరించుకుని రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన భారీ సెట్టింగులు ఆకట్టుకున్నాయి. భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

కొవ్వూరు: ఐ.పంగిడి గ్రామ సమీపంలో టీవీఎస్ మోపెడ్‌పై వెళుతున్న మీనానగరానికి చెందిన కట్టా శ్రీనివాస్‌ను శనివారం వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. శ్రీనివాస్ ఐ.పంగిడిలో పనిచేస్తున్న తన కుమారుడికి భోజనం తీసుకు వెళుతూ ఈ ప్రమాదం బారిన పడ్డాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలైన శ్రీనివాస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ప్రజలకు భోగ భాగ్యాలు ప్రసాదించాలి

- భోగి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ భరత్‌రామ్
- నగరంలో వాడవాడలా వేడుకలు

రాజమహేంద్రవరం రూరల్: ప్రజలందరికీ భోగ భాగ్యాలు, సుఖ సంతోషాలు కలుగజేయాలని మనస్ఫూర్తిగా ఆ భగవంతుడిని కోరుతున్నానని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ పేర్కొన్నారు. భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎంపీ భరత్ నివాసం వద్ద పెద్దఎత్తున తరలివచ్చిన పార్టీ కార్యకర్తలు, నేతలతో కలసి శనివారం ఉదయం 4 గంటల నుంచే సందడి నెలకొంది. నగర హైవే బెస్ట్‌ప్రైస్ పక్కన ఉన్న ఎంపీ నివాసం లక్ష్మోరా అపార్ట్‌మెంట్స్ వద్ద భోగి సంబరాలు అంబరాన్నంటాయి. హరిదాసులు, జంగమ్మదేవరలు, పిట్టల దొర, శోదమ్మల సందడితో పండగ వాతావరణం కనిపించింది. అపార్ట్‌మెంట్స్ బయట భారీ స్థాయిలో భోగి మంట వేశారు. ఎంపీ భరత్ కుటుంబ సభ్యులు, ఆయన తల్లిదండ్రులు భోగి మంట చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణలు చేసి, ఆవు పిడకల దండలను ఆ మంటలో వేశారు. ఈ సందర్భంగా ఎంపీకి వైఎస్సార్ సీపీ శ్రేణులు భోగి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలుగువారు ప్రపంచంలో ఎక్కడున్నా సంక్రాంతికి తమ కుటుంబ సభ్యులు, బంధువులతో గడిపేందుకు ఎక్కువ ఆసక్తి కనబరుస్తారని చెప్పారు. ఉభయ గోదావరి జిల్లాలకు లక్షలాది మంది తరలివస్తారన్నారు. భోగి రోజు అన్ని చెడు కర్మలు తొలగాలని కోరుతూ పాత వస్తువులను మంటలో వేస్తారని అన్నారు. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే పెద్ద పండగ ఈ సంక్రాంతి అన్నారు.



భోగి వేడుకలలో రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్



హరిదాసుకు బియ్యం వేస్తున్న ఎంపీ భరత్‌రామ్



వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో భోగి వేడుకలో చందన నాగేశ్వర్, డాక్టర్ పర్వతవర్ధిని దంపతులు



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యప్రకాశరావు తదితరులు

కేంద్రానికి సద్బుద్ధి ప్రసాదించాలి

కేంద్రానికి సద్బుద్ధి ప్రసాదించి, మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించేలా ఆ భగవంతుడు కేంద్రంలో పెద్దల మనసు మార్చాలని ఎంపీ భరత్‌రామ్ ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఈ రాష్ట్రాన్ని నలభై, యాభై ఏళ్ల పాటు పాలించే విధంగా శక్తిని ప్రసాదించాలని ఆ భగవంతుని కోరుకున్నట్టు ఎంపీ తెలిపారు. రాష్ట్ర తెలికుల, గాండ్ల కార్పొరేషన్ చైర్మన్ సంకిన భవానీప్రియ, ఉభయ రాష్ట్రాల బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సందడే.. సందడి

సీటీఆర్ఐ: నగరంలో భోగి పండగను వీధి వీధినా జరుపుకొన్నారు. భోగభాగ్యాలు తెచ్చే ఈ పండగను పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే మంటలు వెలిగించారు. ప్రజలు తమ ఇళ్లలోని పాత సామాన్లను తీసుకుని వచ్చి మంటల్లో వేశారు. ఆవు పేడతో తయారు చేసిన పిడకలను మంటల్లో వేశారు. నగర వాసులంతా సందడి చేశారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి, బొమ్మల కొలువులు ఏర్పాటు చేశారు. స్థానిక 48వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు అజ్జరపు వాసు ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు ట్రోఫీని ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ 20 ఏళ్లుగా క్రమం తప్పకుండా వాసు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు.

రూరల్ పార్టీ కార్యాలయంలో..

రాజమహేంద్రవరం రూరల్: ప్రజలందరికీ సుఖసంతోషాలు ప్రసాదించాలని ఆ భగవంతుడిని కోరుతున్నానని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో చందన నాగేశ్వర్, ఆయన సతీమణి డాక్టర్ పర్వతవర్ధిని, పిల్లలతో కలసి భోగి పండగను ఘనంగా నిర్వహించారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని నగరపాలక సంస్థ డివిజన్లు, గ్రామాల్లోని యువత భోగి మంటలు వేసి సందడి చేశారు. ప్రతి ఇంటా ముగ్గులు వేశారు.

జగనన్న కాలనీలో సంక్రాంతి సంబరాలు



జేగురుపాడు జగనన్న కాలనీలో భోగి మంట వద్ద సర్పంచ్ స్టాలిన్ తదితరులు

కడియం: జేగురుపాడు పంచాయతీ పరిధి జగనన్న కాలనీలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఇక్కడ దాదాపు ఎనిమిది గ్రామాలకు చెందిన 2020 మందికి స్థలాలు కేటాయించగా, 500 మంది ఇళ్లు నిర్మించుకున్నారు. వీరంతా ఆనందంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించుకున్నారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు గ్రామ సర్పంచ్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు యాదల సతీష్ చంద్రస్టాలిన్ చేతుల మీదుగా భోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఇంటి స్థలాల కోసం ఎదురు చూస్తున్న పేదల కలను సీఎం జగన్ నెరవేర్చారన్నారు. సంక్రాంతి సంబరాల్లో పుణ్యమంతుల రాంబాబు, కుమార్, అడబాల రాజు, కాకి అంజి, చంద్రగిరి శంకర్, పి.దుర్గాప్రసాద్, సాకా కిరణ్ కుమార్, మద్దిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వామి శరణం.. అయ్యప్ప శరణం

- వైభవంగా తిరువాభరణ ఉత్సవం
- మకరజ్యోతి దర్శనంతో పులకించిన భక్తజనం

సీటీఆర్ఐ: గోదావరి తీరం పులకించింది.. అయ్యప్ప శరణు ఘోషతో మార్మోగింది.. నగరం అంతా భక్త జనసంద్రంగా మారింది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల మధ్య స్వామివారి తిరువాభరణ ఉత్సవం రమణీయంగా సాగింది. ఎన్నో కళలు, సంస్కృతీ సంప్రదాయాలకు నెలవైన నగరంలో ఈ ఉత్సవాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కుటుంబ సభ్యులు వైభవంగా నిర్వహించారు. స్థానిక ప్రకాశంనగర్‌లోని జక్కంపూడి రామ్మోహనరావు నివాసం నుంచి గురుస్వాముల పర్యవేక్షణలో కొమ్ముల సాయి, జక్కంపూడి గణేష్ అయ్యప్ప స్వామి తిరువా ఆభరణాలను, అమ్మవారి ఆభరణాలను గోదావరి గట్టున ఉన్న అయ్యప్ప స్వామివారి ఆలయానికి తీసుకు వచ్చారు. కేరళ చెండై వాయిద్యాలు, కోలాటాలు, డోలు సన్నాయి, మేళ తాళాలు, కేరళ సంప్రదాయ నృత్యాలతో అశేష భక్తజనం నడుమ ఊరేగింపుగా బయలుదేరారు. టీటీడీ కల్యాణ మండపం, కంబాలచెరువు, దేవీచౌక్, మెయిన్ రోడ్డు డీలక్స్ సెంటర్, విశ్వేశ్వరస్వామి గుడి మీదుగా అయ్యప్ప స్వామివారి ఆలయానికి చేరుకుని స్వామివారి ఆభరణాలను పూజారులకు సమర్పించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి తిరువాభరణాలను అలంకరించారు. తిరువాభరణ ఘట్టం పూర్తయ్యాక 6.45 గంటలకు మకరజ్యోతి రూపంలో అయ్యప్ప స్వామి భక్తులకు దర్శనమిచ్చారు.



ఊరేగింపులో వివిధ వేషధారణలతో సందడి



తిరువాభరణ ఉత్సవంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

శబరిమల మాదిరిగా పూజలు

రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు శ్రీధర్మశాస్త్ర ఆధ్యాత్మిక కేంద్రం అనే ట్రస్టును ఏర్పాటు చేసి పవిత్ర గోదావరి నదీ తీరాన నగరంలో శబరిమల అయ్యప్ప స్వామి ఆలయం నిర్మించారన్నారు. స్వామివారి విగ్రహాన్ని పంచలోహాలతో తయారు చేయించి శబరిమల ఆలయంలో ఎటువంటి పూజలు నిర్వహిస్తారో అదే మాదిరిగా ఇక్కడా చేస్తున్నారన్నారు. ప్రతి ఏడాది శబరిమలలో నిర్వహించే స్వామివారి జ్యోతి దర్శనం, తిరువాభరణోత్సవం మాదిరిగా ఈ ఆలయంలో వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. అయ్యప్ప స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. ఆలయ ట్రస్ట్ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రాత్రి పది గంటలకు స్వామివారి పవళింపు సేవతో కార్యక్రమం ముగిసింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ ఉత్సవాలకు డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి హాజరై పూజలు చేశారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నాయకులు నందెపు శ్రీనివాస్, దాసి వెంకట్రావు, సంకీన భవాని ప్రియ, అడపా అనిల్, మానే దొరబాబు, అయ్యప్ప స్వామి ఆలయ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు. మాజీ ఎంపీ మురళీమోహన్ వచ్చి స్వామివారికి ఇరుముడులు సమర్పించారు.

కోడిపందేలకు సై



పుణ్యక్షేత్రంలో కోడి పందేల వద్ద సందడి

రాజానగరం: సంక్రాంతి పండగల నేపథ్యంలో శనివారం కోడి పందేలు జోరుగా జరిగాయి. రాజానగరం మండలం శ్రీరామపురం, పుణ్యక్షేత్రం, దివాన్‌చెరువు (పాలచర్ల), నరేంద్రపురం, ముక్కినాడ పాకలు, జియ్యరంపాలెం, కోరుకొండ మండలం గాదరాడ, కోరుకొండ, బూరుగుపూడి, దోసకాలయపల్లి, నిడిగట్ల, సీతానగరం మండలం పెదకొండేపూడి, నాగంపల్లి, మిర్తిపాడు, రూరల్ పరిధిలోని తొర్రేడు ఏరియాలలోని తోటలు కోడి పందేల బరులయ్యాయి. ఒక్కో బరిలో రూ. 5 లక్షల నుంచి రూ. 75 లక్షల వరకు పందేలు జరిగినట్లు సమాచారం.

కనుల పండువగా గోదాదేవి కల్యాణం



గోవింద క్షేత్రంలో గోదాదేవి కల్యాణం



దుళ్లలో గోదా కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

సీటీఆర్ఐ: వైష్ణవాలయాలలో నిర్వహించిన ధనుర్మాస ఉత్సవాలు గోదాదేవి కల్యాణంతో ముగిశాయి. రాజమహేంద్రవరం సిటీ, రూరల్‌లోని అన్ని వైష్ణవాలయాల్లో శనివారం సాయంత్రం గోదాదేవి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అమ్మవారిని విశేష అలంకరణలో ముస్తాబు చేసి శ్రీరంగనాధుని వద్దకు తీసుకుని వెళ్లి వార్షిక కల్యాణం జరిపించడంతో భక్తులు పరవశించారు. స్థానిక గోదావరి గట్టున శ్రీరంగధామంలో, క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామి ఆలయంలో, లాలాచెరువు వద్ద శ్రీగోవింద క్షేత్రంలో అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించారు. గోవింద క్షేత్రంలో అర్చకులు శ్రీమన్నారాయణ స్వామి, రమేష్ స్వామి కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దుళ్లలో అంగరంగ వైభవంగా..

కడియం: దుళ్లలోని వేంకటేశ్వరస్వామివారి ఆలయం వద్ద శనివారం గోదా కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకుడు పెద్దింటి లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు. గత నెల రోజులుగా ప్రతి నిత్యం ధనుర్మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు కల్యాణం జరిపించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఉండ్రాజవరం హైస్కూల్ 1995-96 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

ఉండ్రాజవరం: స్థానిక ఉన్నత పాఠశాల 1995–96 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం శనివారం ఆ హైస్కూల్ ప్రాంగణంలో కోలాహలంగా సాగింది. అప్పటి విద్యార్థులందరూ ఒకరినొకరు పేరు పెట్టి పిలుచుకుంటూ యోగక్షేమాలను, కుటుంబ స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల రోజులను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. కుటుంబాలతో సహా రావడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆనందంగా గడిపారు. భోగి రోజున ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడంతో పాఠశాల ప్రాంగణంలో భోగి మంట వేశారు. పిండి వంటలు చేసుకుని విందు వినోదాలతో ఆనందంగా గడిపారు.

సంస్కృతీ సంప్రదాయాల మేళవింపు సంక్రాంతి



సంక్రాంతి వేడుకలకు శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: తెలుగు సంస్కృతీ సంప్రదాయాల మేళవింపు సంక్రాంతి పండగ అని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని శనివారం అనపర్తిలో సంప్రదాయ సంక్రాంతి పోటీలకు ఆయన శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా స్థానికంగా ఏర్పాటు చేసిన సంప్రదాయ కోడి పందేలను ఎమ్మెల్యే ప్రారంభించి కొద్దిసేపు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగలు, జాతరలు సంస్కృతిలో భాగమన్నారు. సంక్రాంతి సమయంలో కోడి పందేల నిర్వహణకు చారిత్రక నేపథ్యం ఉందని, ఇవి పల్లెలకు మరింత శోభను తెస్తాయన్నారు. జీవహింస లేకుండా కోడి పందేలు సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని సూచించారు.

ప్రకటన

[illegible]

గుడివాడ
తేది. 15-01-2023

యస్. వెంకటేష్ ..., అడ్వకేట్ & నోటరీ
డోర్ నెం. 16/261-ఎ,
సత్యనారాయణపురం, గుడివాడ-521 301
ఫోన్ : 94407 40022